శరవేగంగా పునాదిపాడు అభివృద్ధి


పునాదిపాడు సచివాలయ భవనం


సిద్ధమైన రైతుభరోసా కేంద్రం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దుకాణ సముదాయం


గ్రామంలోని నిర్మించిన సిమెంటు రోడ్డు

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు
- అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ కింద రూ. 20.74 కోట్లు లబ్ధి
- నాన్ డీబీటీ కింద రూ. 10.63 కోట్లు లబ్ధి

గ్రామాభివృద్ధి లక్ష్యం..



గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అందరినీ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి దిశగా నడుస్తున్నాం. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– మునిబోయిన విజయకుమారి, సర్పంచ్, పునాదిపాడు

కంకిపాడు: పునాదిపాడు గ్రామంలో ప్రగతి పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరాయి. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఇంటివద్దే అందుతున్నాయి. పాలన సమర్థంగా సాగుతుండటం, సమకూరుతున్న వసతులతో పునాదిపాడు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామంలో ఇప్పటి వరకూ రూ. 4.25 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 81 లక్షలతో గ్రామంలోని రెండు సచివాలయాలకు సొంత భవనాలు సమకూరాయి. రూ. 45 లక్షలతో రెండు రైతుభరోసా కేంద్రాలు, రూ. 25 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ. 18 లక్షలతో మిల్క్ సెంటర్ల నిర్మాణం చేపట్టారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో తాగునీటి సదుపాయం, పైపులైన్ల విస్తరణ, అంతర్గత రహదారుల నిర్మాణాలను పూర్తి చేశారు. జెడ్పీ నిధులు రూ. 5 లక్షలతో స్మశానవాటిక రోడ్డు అభివృద్ధి, మండల నిధులు రూ. 5 లక్షలతో అదే రోడ్డులో కల్వర్టుల నిర్మాణం, కాలనీలో రూ. 11.50 లక్షలతో పైపులైను, ప్రధాన రహదారి నిర్మాణాలు పూర్తి చేశారు. ప్రత్యేకించి గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో అనేక ప్రాంతాల్లో సిమెంటు రహదారులు, డ్రెయినేజీ సదుపాయం, తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు బోర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు నిధుల సమస్య తలెత్తకుండా పంచాయతీ నిధులను వెచ్చించి అధునాతన సౌకర్యాలతో భవన నిర్మాణాలను పూర్తి చేశారు. రూ. 16.50 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంటు భవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆదాయ పెంపుదల కోసం పంచాయతీ నిధులు రూ. 10 లక్షలు అంచనా వ్యయంతో దుకాణ సముదాయం నిర్మించారు. దుకాణాలను కేటాయించాల్సి ఉంది.



డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
వైఎస్సార్ ఆసరా	894	రూ. 3.01 కోట్లు
అమ్మ ఒడి	481	రూ. 2.11 కోట్లు
జగనన్న చేదోడు	18	రూ. 4.40 లక్షలు
కోవిడ్‌సాయం	1273	రూ. 12.73 లక్షలు
పంటల బీమా	92	రూ. 12.99 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	35	రూ. 9.90 లక్షలు
హౌసింగ్ (నేరుగా చెల్లింపు)	129	రూ. 1.30 కోట్లు
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	192	రూ. 26.51 లక్షలు
జగనన్న తోడు(వడ్డీ)	70	రూ. 31,310 వేలు
జగనన్న వసతి దీవెన	215	రూ. 36.77 లక్షలు
జగనన్న విద్యాదీవెన	184	రూ. 80.56 లక్షలు
వైఎస్సార్ కల్యాణ మస్తు	4	రూ. 3.25 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	13	రూ. 5.10 లక్షలు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	4	రూ. 1.20 లక్షలు
పాస్టర్లకు సాయం	13	రూ. 65,000 వేలు
వైఎస్సార్ పింఛన్ కానుక	757	రూ. 7.18 కోట్లు
వైఎస్సార్ రైతుభరోసా	443	రూ. 1.91 కోట్లు
సున్నా వడ్డీ పంట రుణాలు	94	రూ. 2.12 లక్షలు
సున్నా వడ్డీ	1013	రూ. 21.47 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	31	రూ. 8.00 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	147	రూ. 10.12 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	214	రూ. 92.49 లక్షలు
వైఎస్సార్ బీమా	16	రూ. 21.50 లక్షలు
వైఎస్సార్ చేయూత	377	రూ. 1.68 కోట్లు
అగ్రిగోల్డ్	62	రూ. 3.40 లక్షలు
మొత్తం	6771	రూ. 20.74 కోట్లు

నాన్ డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
జగనన్న గోరుముద్ద	278	రూ. 27.54 లక్షలు
హౌస్ సైట్స్	252	రూ 6.19 కోట్లు
జగనన్న తోడు(రుణాలు)	111	రూ. 20.66 లక్షలు
బియ్యం కార్డులు	1492	రూ. 3.25 కోట్లు
ట్యాబ్‌లు	44	రూ. 5.81 లక్షలు
జగనన్న విద్యా కానుక	270	రూ. 19.17 లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	237	రూ. 44.39 లక్షలు
మొత్తం	2684	రూ. 10.63 కోట్లు

రూ. 31.37 కోట్లు లబ్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను వర్తింప చేసింది. వివిధ సంక్షేమ పథకాల కింద 6,771 మంది లబ్ధిదారులకు రూ. 20.74 కోట్ల మేర నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యింది. పరోక్షంగా 2,684 మందికి రూ. 10.63 కోట్ల లబ్ధి చేకూరింది. నివేశన స్థలాలు లేని 252 మంది పేదలకు భూములను సేకరించి ఇళ్ల స్థలాలను కేటాయించి ప్రజల మోములో చిరునవ్వులు చిందేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుని సంక్షేమ పాలనకు అర్థం చెప్పింది.

ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రజాదర్బార్

మంత్రి జోగి రమేష్


ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి శనివారం పోరంకిలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రధానంగా తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించామని తెలిపారు. ఇంకా అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వెంటనే చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అమలు చేశామన్నారు. ఇంకా ఇళ్ల స్థలాలు, పింఛన్లు రానివారికి అర్హత ఉంటే న్యాయం చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 19 గ్రామ సచివాలయాలు ప్రజలకు సేవలు అందించడానికి నిరంతరాయంగా పని చేస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ జోగి రమేష్ లేడని, జగనన్న తనను ఇక్కడికి పంపారని, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నేరుగా తనను కలవాలని సూచించారు.

సమస్యలపై వెంటనే స్పందన..

ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై మంత్రి జోగి రమేష్ వెంటనే స్పందించారు. కానూరులో ముస్లింలకు ప్రార్థన చేసుకోవడానికి ఈద్గాకు 2 ఎకరాల స్థలం ప్రతిపాదించారు. సనత్‌నగర్‌లో ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు రూ. 40 లక్షలు మంజూరు చేశారు. అరబిక్ పాఠశాల భవనానికి 3 సెంట్ల స్థలం కేటాయించారు. పోరంకిలో స్మశానవాటిక అభివృద్ధి, రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం చేయాలని స్థానికుల నుంచి అర్జీలు అందాయి. యనమలకుదురు, తాడిగడప ప్రాంతాల్లో కూడా పలు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, నియోజకవర్గ పరిశీలకులు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, రామసుధీర్, పార్టీ నగర అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, అధికారులు, నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గన్నవరం రూరల్: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండలంలోని మాదలవారిగూడెం, చనుపల్లివారిగూడెంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. 'ప్రతీసారి రెండు చుక్కలు, పోలియోపై నిరంతర విజయం' అంటూ నినాదాలు చేస్తూ పాఠశాల, అంగన్వాడీ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ పోలియో నివారణ చుక్కలు వేయించాలని ఆరోగ్య సిబ్బంది ప్రచారం చేశారు.

కంకిపాడు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.అనూష సూచించారు. శనివారం ఆమె వివరాలు తెలుపుతూ ఆదివారం జాతీయ ఇమ్యునైజేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పోలియో చుక్కల కేంద్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు.

4 రూట్లలో పల్స్ పోలియో

విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండలంలో నాలుగు రూట్లలో పల్స్ పోలియో నివారణ చుక్కల మందును వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సరఫరా చేయడం జరుగుతుందని నున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.నిరంజన్ తెలిపారు. వెలగలేరు నుంచి అంబాపురం, పి.నైనవరం గ్రామాలకు ఒకటో రూట్, నున్న, పాతపాడు, మంగళాపురం గ్రామాలకు రెండో రూట్, రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాలకు మూడో రూట్, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలకు నాల్గవ రూట్లలో పోలియో చుక్కల మందును సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయడం జరుగుతుందని వివరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలి


ముదునూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జోగి రాజీవ్

ఉయ్యూరు: సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించి మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోదరుడు జోగి రోహిత్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రాజీవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. పేదలు ఆర్థికంగా ఎదగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో తన తండ్రి జోగి రమేష్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి, వైస్ ఎంపీపీ గంజి వెంకటస్వర్ణకుమారి, దాకరపు అజయ్, నున్న శ్రీను, నున్న బాలరాజు, ఎం.రామకృష్ణ, ఆదినారాయణశాస్త్రి, తంబి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు

గన్నవరం: సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు విద్య, ఉపాధి పరంగా సమాన అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ట్రైనింగ్ కళాశాలలో ప్రత్యేక విద్యపై గత నాలుగు రోజులుగా రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక విద్యను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత నెలకొందన్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్న పాఠశాలలో స్పెషల్ టీచర్లను నియమించేందుకు మార్గదర్శకాలను జారీ చేసినట్లు చెప్పారు. దీని వల్ల సాధారణ విద్యార్థులతో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు మమేకమై అనేక అంశాలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా ప్రత్యేక ఉపాధ్యాయులను తీర్చిదిద్దుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీని ప్రోత్సహించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనింగ్ టీచర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం ఎస్.రవీంద్రభవాని, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు జీ జయబాబు, ఏఎంసీ డైరెక్టర్ మోటమర్రి శేఖర్, సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోరంకి మహాలక్ష్మినగర్ ప్రాంతానికి చెందిన డి.సుబ్బారావు వ్యవసాయ పనులు చేస్తాడు. అతను బైక్‌పై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా నిడమానూరు రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి గాయాలు అయ్యాయి. బాధితుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ



పెనమలూరు: మండల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక గ్రామాల్లో వలంటీర్లు సకాలంలో పంపిణీ చేస్తున్నారు. పెనమలూరు మండలంలో 5,823 పింఛన్లు, తాడిగడప మున్సిపాలిటీలో 12,965 మందికి వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. మండల పరిధిలో దాదాపు 90 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. పెనమలూరు సచివాలయం-1 పరిధిలో దివ్యాంగుడు ఆవుల బుల్లయ్య ఇంటికి వెళ్లి వలంటీర్ షేక్ ఆశా పింఛన్ సొమ్ము అందజేసింది.

జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి సన్నాహాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతనంగా రూ. 4.40 కోట్లతో నిర్మించిన హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వాణిశ్రీ శనివారం పరిశీలించారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే బస్టాండ్‌ను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్ పనులను పరిశీలించిన జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో చర్యలు చేపట్టారు. బస్‌స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకం నిర్మాణంపై పలు సూచనలను వాణిశ్రీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ రాజశేఖర్, గన్నవరం డిపో మేనేజర్ శివాజీ, హనుమాన్‌జంక్షన్ బస్టాండ్ కంట్రోలర్ శేఖర్ పాల్గొన్నారు.

చురుగ్గా పైపులైను విస్తరణ పనులు



కంకిపాడు: ప్రొద్దుటూరు బీసీ కాలనీలో పైపులైన్ విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నూతన పైపులైన్ల ఏర్పాటుతో తాగునీటి కొరత తలెత్తకుండా అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకుంటోంది. ప్రొద్దుటూరు గ్రామ పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటిని సమృద్ధిగా పంపిణీ చేసేందుకు పాలకవర్గం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రూ. 30 లక్షల అంచనా వ్యయంతో పైపులైన్ల ఏర్పాటు పనులను చేపట్టారు. ఈ పనులను ఈఓ కుర్మారావు, సచివాలయ సిబ్బంది శనివారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ సందీప్ తెలిపిన కథనం మేరకు మండలంలోని గొడవర్రు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కాగిత కొండలరావు నివాసం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కొండలరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెల్టుషాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ సందీప్ హెచ్చరించారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటా

కంకిపాడు: అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను శనివారం రాత్రి మంత్రి జోగి రమేష్ పరామర్శించారు. ప్రమాద వివరాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో నష్టపోయిన ఒక్కో కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందించారు. మంత్రి రమేష్ మాట్లాడుతూ ప్రమాద తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు ప్రమాద పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజు, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, నాయకులు గుజ్జుల కోటేశ్వరరావు, కొణతం గిరిబాబు, నర్రా రమేష్ బాబు, కొండా రామిరెడ్డి, రాయసం వెంకటరమణ, రుద్రయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు అండగా ప్రభుత్వం


పారిశుద్ధ్య కార్మికుడికి కిట్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పోరంకిలో శనివారం తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు రూ. 15 లక్షలతో యూనిఫాం, పాదరక్షలు, ఆయిల్, సబ్బులు, వాకీటాకీ ఇతర సామాగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల జీతాలు పెంచామన్నారు. అలాగే వారి ఉద్యోగానికి భద్రత కల్పించామని తెలిపారు. కార్మికులు ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వారి జీతాలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో కార్మికుల పాత్ర చాలా కీలకమయిందని తెలిపారు. కార్మికులు కూడా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మరువరాదని సూచించారు. కార్మికులకు సమస్యలు ఉంటే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, తూర్పు, పెనమలూరు నియోజకవర్గ పరిశీలకులు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, రామసుధీర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, కుందేటి శివరామకృష్ణ, వీరబాబు, చాంద్‌బాషా, సిద్దిక్, అద్దెపల్లి చందు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు


లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసిన ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

రామవరప్పాడు: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలను ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో ఇటీవల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పట్టాలను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా వేల మందికి ఇళ్ల స్థలాలు, పక్కా గృహం మంజూరైనట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలకు వేగవంతంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్న జగనన్న ఆదేశంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను దాదాపు పూర్తి చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు మాట్లాడుతూ ప్రసాదంపాడు గ్రామంలో మొత్తం 1200 మందికి ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు చెప్పారు. వీరికి గతంలోనే పట్టాలు అందజేశామని ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి 40 మందికి అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దూరు రత్నం, వీఆర్వో చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ మూర్తి చిత్రకళ ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఎంఎస్ మూర్తి చిత్రకళా ప్రదర్శన, దృశ్య శ్రవణ చిత్రం ఏర్పాటు చేసినట్లు అకాడమీ కార్యదర్శి ఎంపీ సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకళా ప్రదర్శనను ఉదయం 10 గంటలకు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చిలానంద, శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం పరిపాలన అధికారి కె.ఎస్.రామారావు చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. ఎంఎస్ మూర్తి చిత్రకళా రంగానికి చేసిన నిస్వార్థ సేవలకు, విజయవాడ నగరంలో ఆర్ట్ గ్యాలరీ నిర్మాణానికి వారు చేసిన సేవలకు గుర్తింపుగా గతేడాది నవంబర్ నుంచి శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక లావాదేవీల కారణంగా కిడ్నాప్

పెనమలూరు: ఆర్థిక లావాదేవీల వివాదం కారణంగా ఓ వ్యక్తిని పలువురు వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనగర్‌కాలువ కట్టకు చెందిన బి.వీరన్‌కుమార్, అమలాపురంకు చెందిన రాజా కలిసి గతంలో మలేషియాలో ఉద్యోగం చేశారు. ఈ పరిచయంతో ఇద్దరూ కలిసి వ్యాపారం ప్రారంభించారు. వ్యాపార లావాదేవీల్లో వీరన్‌కుమార్ రాజాకు పెద్ద ఎత్తున సొమ్ము బాకీపడ్డాడు. తీసుకున్న సొమ్ము చెల్లించకపోవడంతో వీరన్‌కుమార్‌ను శుక్రవారం సాయంత్రం రెండు కార్లలో పలువురు వ్యక్తులు వచ్చి బలవంతంగా తీసుకువెళ్లారు. పోలీసులు వెంటనే స్పందించి వీరన్‌కుమార్ ఆచూకీ తెలుసుకుని ఇంటికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.